APTEL 15625

అటవీశాఖ సమాచార పత్రిక

వన సంరక్షిణి

నవంబర్ 2018

సంపుటి : 1 సంచిక : 8

చీఫ్ ఎడిటర్

జె.ఎస్.ఎన్.మూర్తి, M.Sc (Ag), M.Sc (Forestry)
సంచాలకులు : ఎ.పి. స్టేట్ ఫారెస్ట్ అకాడమీ

ఎడిటోరియల్ విభాగం

ఎం.వి. ప్రసాదరావు
ఉప సంచాలకులు

దీక్షితుల ఆర్.వి. సుబ్రహ్మణ్యం
పి.ఆర్.ఓ

అటవీ అకాడమీ పరిశీలించిన పిసిసిఎఫ్ (ఎఫ్ఆర్) డా॥ రమణమూర్తి

రాష్ట్ర ప్రధాన ముఖ్య అటవీ సంరక్షణాధికారి (ఎఫ్ఆర్) డా॥ విబి రమణమూర్తి గురువారం ఎపి స్టేట్ ఫారెస్ట్ అకాడమీలో జరిగిన బోర్డ్ ఆఫ్ కంట్రోల్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అకాడమీ ప్రాంగణంలోని రీజినల్ ఫారెస్ట్ రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యం లో ఉన్న నర్సరీలను, అకాడమీ విభాగాలను పరిశీలించారు. రీసెర్చ్ విభాగం గ్రీన్ హౌస్‌లో పెంచుతున్న వెదురు ప్లాంటేషన్లను రమణ మూర్తి పరిశీలించారు. గ్రీన్‌హౌస్ నిర్మాణం, నిర్వహణ విధానాల్లు పూర్తిస్థాయిలో శాస్త్రీయంగా ఉండాలన్నారు. గ్రీన్‌హౌస్‌లో ఉష్ణోగ్రత నియంత్రణ, అందులో సంరక్షిస్తున్న జాతుల వివరాలతో బోర్డుల ఏర్పాటుపై రిసెర్చ్ సైంటిస్టులకు సూచనలిచ్చారు. **(లోపలి పేజీలో)**

ప్రకృతితో మమేకమే ఆదర్శ జీవనం

ప్రధాన వన్యప్రాణి సంరక్షణాధికారి డాక్టర్ నళినీమోహన్

ప్రకృతితో సన్నిహితంగా జీవిస్తూ, ప్రకృతి వనరులపై సదవగాహన ఏర్పరచు కోవడం ద్వారా ఆదర్శ జీవన విధానాన్ని అలవర్చుకోవాలని ప్రధాన ముఖ్య అటవీ సంరక్షణాధికారి (పీసీసీఎఫ్), చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ డాక్టర్ నళినీమోహన్ విద్యార్థులకు, అటవీ శాఖాధికారులకు ఉద్బోధించారు. బుధవారం స్థానిక దివాన్ చెరువులోని నగరవనంలో వన్యప్రాణి సప్తాహం సందర్భంగా రాజమండ్రి వైల్డ్ లైఫ్ విభాగం ఏర్పాటు చేసిన సదస్సుకు అయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సదస్సులో పాల్గొన్న నన్నయ యూనివర్సిటీ ఎం ఎస్ సి విద్యార్థులను, అటవీ అకాడమీలో శిక్షణ పొందుతున్న అటవీ అధికారులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ప్రతి మొక్క, జంతువుకి సంబంధించిన శాస్త్రీయ నామాలను సరైన అవగాహనతో అర్థం చేసుకుంటే **(లోపలి పేజీలో)**

అంతర్జాతీయ లక్ష్యాలకు దీటుగా అటవీ అకాడమీలో శిక్షణ

అంతర్జాతీయంగా అటవీ విధానాలలో వస్తున్న మార్పుల్ని అందిపుచ్చుకోవడం, ప్రపంచవ్యాప్త లక్ష్యాలను చేరుకోవడం అటవీ అధికారుల ముందున్న పెద్ద సవాలు అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అటవీ అకాడమీ డైరెక్టర్ జెఎస్ఎన్ మూర్తి అన్నారు. ఈ సవాలును అధిగమించే స్థాయిలో క్షేత్రస్థాయి సిబ్బందిని నిపుణులుగా తీర్చిదిద్దడమే అకాడమీ లక్ష్యమని చెప్పారు. దివాన్ చెరువులోని రాష్ట్ర అటవీ శిక్షణాసంస్థ లో మూడవ బ్యాచ్ సెక్షన్ అధికారులు, ఐదవ బ్యాచ్ బీట్ అధికారుల శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. రెండు విభాగాల్లో రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి మొత్తం 56 మంది అటవీ అధికారులు చేరారు. శిక్షణ ప్రారంభ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన అకాడమీ డైరెక్టర్ మూర్తి ప్రసంగిస్తూ ఎఫ్ బిఓ లకు 6 నెలలు, **(లోపలి పేజీలో)**

పక్షి ప్రపంచం

జాతీయ పక్షి నెమలి

నెమలి భారత దేశ జాతీయ పక్షి. నెమలి చాలా అందమైన పక్షి. దీనిని చూడగానే మనకు కొట్టొచ్చినట్లు కనబడేది వాటి అందమయిన ఈకలు. మగ నెమలికి మాత్రమే ఇటువంటి పొడవాటి ఈకలు ఉంటాయి. నెమలి ఈకల సముదాయాన్ని నెమలి పింఛంగా వ్యవహరిస్తారు. భారతీయ సనాతన ధర్మంలో, పురాణాదుల్లో నెమలికి ఎంతో ప్రాధాన్యత ఉంది. శ్రీకృష్ణుడు ఎప్పుడూ నెమలి పింఛాన్ని తన కిరీటంలో అలంకారంగా ధరించేవాడు. శివుని కుమారుడు సుబ్రహ్మణ్యస్వామి తన వాహనంగా నెమలిని వినియోగించేవాడు.

నెమలి శాకాహారాన్ని, మాంసాహారాన్ని కూడా ఆహారంగా స్వీకరిస్తుంది. పూవుల రెక్కలు, మొక్క భాగాలు, విత్తనం మొలకలు, కీటకాలు, అప్పుడప్పుడూ బల్లి వంటి సరీసృపాలను మరియూ కప్పల వంటి ఉభయచరాలను కూడా నెమళ్ళు భుజిస్తాయి. నెమళ్ళలో చాలా రకాలున్నాయి.

భారతీయ నెమలి (పావో క్రిస్టేటస్) - ఈ నెమలి భారత ఉప ఖండంలో విస్తారంగా కనిపిస్తుంది. ఈ జాతి నెమలినే భారత మరియు శ్రీలంక దేశాలు తమ జాతీయ పక్షిగా ఎన్నుకున్నాయి.

కాంగో నెమలి (ఆఫ్రోపావో కాంగోలెన్సిస్) - ఇది మధ్య ఆఫ్రికాలోని కొన్ని ప్రాంతాలలో మాత్రమే కనిపిస్తుంది.

ఆకుపచ్చ నెమలి (పావో మ్యూటికస్) - ఇది తూర్పు మయన్మారు నుండి జావా వరకు గల ప్రాంతాలలో కనిపిస్తుంది. ఈ జాతి నెమలి

ప్రస్తుతం అంతరించిపోయే దశలో ఉంది. వేటగాళ్ళ బెడద ఇంకా, వాటి నివాసయోగ్య ప్రాంతాలు అంతరించిపోవడంతో వీటి మనుగడకు తీవ్ర ముప్పు ఏర్పడింది. అంతరించిపోయే దశలో ఉన్న ఈ ఆకుపచ్చ రంగు నెమలి ఐదు వేరు వేరు జాతుల సమ్మేళనం, కానీ ప్రస్తుతం వీటిని ఒకే జాతికి చెందిన మూడు ఉప జాతులుగా వర్గీకరించారు.

నెమళ్ళు ఎక్కువగా గడ్డిమైదానాలలో నివసిస్తుంటాయి. మగ నెమళ్ళకు అందమయిన మెరిసే నీలం-ఆకుపచ్చ లేదా ఆకుపచ్చ రంగు ఈకలతో కూడిన తోక (పింఛం) ప్రధాన ఆకర్షణ. ఈ పొడవాటి ఈకల నిండా ఉండే కళ్ళ వంటి సహజసిద్ధ ఆకృతిని నెమలికన్నుగా వ్యవహరిస్తారు. వాటి అందమంతా అవి పురివిప్పి నాట్యమాడు తున్నప్పుడే అద్భుతంగా గోచరిస్తుంది.

ఆడ నెమలికి ఆకుపచ్చ, గోధుమ మరియు బూడిద రంగులలో ఉండే పింఛం ఉంటుంది. కానీ మగ నెమళ్ళ వలె ఆడనెమలికి పొడవాటి తోక లాంటి ఈకలు ఉండవు. అయతే వీటికి

తలపై ఒక కొప్పు ఉంటుంది.

నెమలి పింఛంలో కనిపించే రంగు అద్భుతంగా ఉంటుంది. వాటి ఈకలమీద పేర్చినట్లు ఉండే సన్నని పీచు లాంటి పదార్థాలే ఇందుకు కారణం. అక్కడ కనిపించే వివిధ రంగులకు వాటి అమరికలోని నిడివి తేడాలే కారణం. గోధుమ రంగు ఈకలకు, ఎరుపు మరియు నీలం రంగులు అవసరం వీటిలో ఒక రంగు అమరిక వలన సృష్టింపబడగా, రెండవది హద్దులలో ఉండే ఇంకో అమరిక వలన కలిగే కాంతి పరావర్తనం వలన ఏర్పడుతుంది. ఇటువంటి పరావర్తనం వలనే నెమలి నాట్యమాడుతున్నప్పుడు వాటి పించాలు మనకు వివిధ కోణాలలో వివిధ రంగులుగా కనిపించి మురిపిస్తాయి. ఇతర జాతులతో కలపడం కారణంగా వేరు వేరు రంగుల ఈకలున్న నెమళ్ళు ఉద్భవించాయి. అటువంటి వాటిలో తెల్లటి నెమళ్ళను చెప్పుకోవచ్చు.

దాదాపు 2000 సంవత్సరాల కాలం నుండి నెమళ్ళు మనుషుల పోషణలో ఉన్నాయని భావిస్తున్నారు. అయినప్పటికీ నెమలిలో పెంపుడు జంతువులలో కనిపించే లక్షణాలు చాలా తక్కువ. ఇప్పటికీ చాలా గ్రామాల్లో జనావాసాలకు సాన్నిహిత్యంగా ఇవి బతుకుతూ ఉండడం కనిపిస్తుంది.

సాధారణంగా నెమలి జగడాల మారి. ఇతర పశుపక్ష్యాదులతో నెమళ్ళు అంతత్వరగా కలవవు.

వృక్ష జాలం

భారీ ఫలాల పనస

పనస (Jackfruit) కలపను, పండ్లను ఇచ్చే చెట్టు. దీనిని సంస్కృతంలో "స్కంధఫలం" అని, హిందీలో "కటహక్-కటహర్-చక్కీ" అని, బంగ్లాలో "కాంటల్"" అని, మరాఠిలో "పణస" అని, ఆంగ్లంలో "ఇండియన్ జాక్ ఫ్రూట్" అని అంటారు. పనస మల్బరీ కుటుంబానికి చెందిన చెట్టు. తూర్పు ఆసియా దీని జన్మస్థలం. ప్రపంచంలోనే అతి పెద్ద పండును ఇచ్చే చెట్టు ఇదే. పనసపండు ఒక్కోటి దాదాపు 36 కేజీలుంటుంది. అనేక రకాల పోషకపదార్థాలు ఈ పండుతో లభిస్తాయి. పనస తొనలు తినడానికి చాలా రుచిగా ఉంటాయి. మనప్రాంతములో పనసను ఎక్కువగా విందు భోజనాలలో కూరగా వాడుతారు. ఇందులో అనేక పోషక, ఔషధ విలువలు ఉన్నాయి. ఇది జీర్ణ శక్తిని మెరుగు పరచును, మలబద్ధకం నివారించును, పొటాషియం ఎక్కువగా ఉన్నందున రక్తపోటును తగ్గించును, విటమిన్ సి ఉన్నందున వ్యాధి నిరోధక శక్తిని మెరుగుపరచును, ఫైటో న్యూట్రియంట్స్ , ఐసోఫ్లేవిన్స్ ఉన్నందున కాన్సర్ నివారణకు సహాయపడును. పనసలో విటమిన్లు, ఖనిజాలు ఎక్కువగా ఉండడం వల్ల మంచి ఆరోగ్యాన్నిస్తుంది. దానిలోని యాంటీ ఆక్సిడెంట్లు, ఫైటోన్యూట్రియెంట్స్ క్యాన్సర్ వ్యాధిని నిరోధిస్తాయి. అజీర్తి, అల్సర్లను కూడా నయం చేస్తుంది. పొటాషియం వల్ల రక్తపోటును తగ్గిస్తుంది. పనస ఆకులు, మొక్క జొన్న, కొబ్బరి చిప్పలను కాల్చి చేసిన పొడి పుండ్లను నయం చేయడానికి ఉపయోగిస్తారు. పనస ఆకులను వేడి చేసి గాయాల మీద పెట్టుకుంటే ఉపశమనం లభిస్తుంది. చర్మవ్యాధులు, ఆస్తమా, జ్వరం, డయేరియా నివారణకు పనస వేర్లు ఉపయోగపడతాయి. అధిక బరువును, టెన్షన్‌ను, మలబద్ధకాన్ని తగ్గిస్తుంది. అజీర్ణం, పాండు వ్యాధి, నంజు, కడుపునొప్పి, అగ్నిమాంధ్యం, క్షయ, శుక్ర నష్టం, అండవాతం మొదలైన వ్యాధులున్నవారు పనసపండును తినరాదు. పనస చెట్టు ఆకులతో విస్తర్లు కుడుతుంటారు.

భారతదేశంలో రెండు రకాల పనసను పండిస్తారు. ఒకటి కూజా చక్క. దీనిలో చిన్న చిన్న తొనలుంటాయి. అవి చాలా తియ్యగా, పీచుగా ఉంటాయి. మృదువుగా ఉండడం వల్ల తొనలను వలవడానికి చాకు అవసరం లేదు. వీటిని బార్కా, బెర్కా అని కూడా అంటారు. రెండవది కూజా పాజమ్. ఇవి వాణిజ్య పరంగా ముఖ్యమైనవి. తొనలు పెళుసుగా ఉంటాయి. వీటిని వలవడానికి చాకును ఉపయోగించాలి. వీటిని కప, కపియా అని అంటారు. పనస కాయలు పండిన తరువాత త్వరగా పాడవుతాయి. అయితే వీటిని 11 నుండి 13 డిగ్రీల ఉష్ణోగ్రత దగ్గర నిల్వ ఉంచితే 3 నుండి 6 వారాల వరకు ఉంటాయి. వాతావరణాన్ని బట్టి ఒక్కో ప్రాంతంలో ఒక్కో సమయంలో పక్వానికి వస్తాయి. కొన్ని చోట్ల మార్చి నుండి జూన్ మధ్యలో, మరి కొన్ని చోట్ల ఏప్రిల్ నుండి సెప్టెంబరు మధ్యలో, ఇంకొన్ని చోట్ల జూన్ నుండి ఆగస్టు మధ్యలో అవి కాస్తాయి. వెస్ట్ ఇండీస్‌లో జూన్‌లోనూ, ఫ్లోరిడాలో వేసవి చివరిలోనూ వస్తాయి. పనస ఒక సతతహరిత వృక్షం. పనస కలపతో వీణలు, మద్దెల, మృదంగం, కంజీర వంటి సంగీత పరికరాలను తయారు చేస్తారు. ఫర్నిచర్, తలుపులు, కిటికీలు, చిన్న పడవల తయారీలోను ఉపయోగిస్తుంటారు. పనస జిగురును పింగాణి పాత్రలకు, బకెట్‌లకు పడిన చిల్లులను మూయడానికి ఉపయోగిస్తారు. దీన్ని వార్నిష్‌లలో కూడా ఉపయోగిస్తారు. పనస చెట్టు వేర్లను చెక్కి ఫొటో ఫ్రేములు తయారు చేస్తారు.

పోషక విలువలు (ప్రతి 100. గ్రాములకు

Sodium - 3 mg Total Carbohydrates - 24 g Dietary Fiber - 2 g Protein - 1 g Vitamin A - 297 IU Vitamin C - 6.7 mg Thiamin - 0.03 mg Riboflavin - 0.11 mg Niacin - 0.4 mg Vitamin B6 - 0.108 mg Folate - 14 mcg Calcium - 34 mg Iron - 0.6 mg Magnesium - 37 mg Phosphorus - 36 mg Potassium - 303 mg Sodium - 3 mg Zinc - 0.42 mg Copper – 0.187 mg Manganese - 0.197 mg Selenium - 0.6 mcg Total Fat - 0.3 mg Saturated Fat - 0.063 mg Monounsaturated Fat - 0.044 mg Polyunsaturated Fat - 0.086 mg Calories - 94

అడవి తల్లి కంట కన్నీరు

ఎడిటర్స్ వాయిస్

ఐక్యరాజ్యసమితి లెక్కల ప్రకారం భూమిపై గల ఉష్ణమండల అడవుల్లో సగం ఇప్పటికే అంతరించాయి. గ్రీన్‌హౌస్ గ్యాస్‌లకు కారణం అడవుల్ని నరికివెయ్యడమే. భూమ్మీద ఉన్న వివిధ జాతుల జంతువుల్లో 70 శాతం వరకూ చెట్లను, పొదలను, అడవులను ఆశ్రయించుకొని జీవిస్తాయి. అడవుల్ని, చెట్లను నరికివేయడంవల్ల జీవ వైవిధ్యం దెబ్బతిని ఇవి కూడా అంతరించి పోతున్నాయి. ఔషధాల తయారీకి కూడా చెట్లు అవసరం. కానీ ఆ కొరత ఏర్పడి రసాయనాలతో ఔషధాలను తయారుచేస్తున్నారు. అడవులకు రోజు రోజుకీ ముప్పు పెరుగుతోంది. ఇటీవల ఒక సర్వే ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ప్రతిరోజూ 80వేల ఎకరాల అడవులు నాశనం అవుతున్నాయని దిగ్భ్రాంతికర విషయం వెలుగులోకి వచ్చింది. ఇది రానున్న విపత్తుకు సూచిక. ఇదిలాగే కొనసాగితే మరో వందేళ్లలో ప్రపంచంలోని మొత్తం వర్షారణ్యాలు కనుమరుగవుతాయి. వ్యవసాయం కోసం అడవుల్ని నరికివేయడం అన్నిటికంటే పెద్ద సమస్య. ప్లాస్టిక్ కప్పులతో పర్యావరణానికి హాని అని చెప్పి మనం పేపర్ కప్పులు వాడుతున్నాం. ఈ కప్పులు కలపను తద్వారా వృక్షసంపదను హరిస్తున్నాయి. ఫర్నిచర్, కాగితం, కాగితంతో తయారయ్యే టిష్యూలు కార్డుబోర్డు బాక్సు ల్లాంటి ఉత్పత్తుల వాడకం విపరీతంగా పెరిగింది. దీనివలన ప్రతిరోజూ అటవీ ప్రాంతం కనుమరుగైపోతోంది. అడవుల నరికివేత వల్ల సంభవించే అనర్థాలు అన్నీ ఇన్నీ కాదు. వచ్చే పాతికేళ్లలో 28000 అరుదైన జాతుల మొక్కలు అంతరించి పోయే ప్రమాదం ఉంది.

కేవలం ఒక్క కాగితం తయారీకే ఏటా 30కోట్ల చెట్లను నరికేస్తున్నారు. ప్రపంచంలోని మొత్తం కాగితం తయారీలో భారత్ వాటా మూడు శాతం. ప్రపంచ జనాభాలో కేవలం 5శాతం ఉన్న అమెరికా 30శాతం కాగితాన్ని వాడుతోంది. ప్రతి రోజూ 27వేల చెట్లు టాయిలెట్ టిష్యూల రూపంలో నాశనమవుతున్నాయి. ఇక సిగరెట్ల తయారీకి అవసరమైన కాగితం కోసం రోజుకి 15 లక్షల చెట్లను నరుకుతున్నారు. ఒక చెట్టు కేవలం మూడువందల సిగరెట్ల తయారీకి ఉపకరిస్తుంది. ఏటా దక్షిణ అమెరికా, ఆఫ్రికా, ఆగ్నేయాసియా దేశాల్లోని 1.3 కోట్ల హెక్టార్ల అడవులు వ్యవసాయ భూములుగా మారుతున్నాయి.

ఒక్క భారత్‌లోనే నోట్ల తయారీకి ఏటా 5.27 లక్షల చెట్లను నరికేస్తున్నారు. ప్లాస్టిక్ కప్పులు, గ్లాసులను వాడకుండా ఉండడం మంచిదే కానీ, వాటి స్థానే పేపరు కప్పులు గ్లాసుల్ని వాడాలని భావించడం మాత్రం నిస్సందేహంగా విచారకరం. పర్యావరణహితం అంటూ పేపర్ కప్పుల్ని వాడుతున్న మనం వాటి తయారీకి ఏటా రెండుకోట్ల చెట్లను నరికేస్తున్నాం. దేశవ్యాప్తంగా వ్యర్థాల రీసైక్లింగ్ అనేది ఇవాళ ఎక్కువగా వినిపిస్తున్న మాట. కానీ ఇది ఆచరణలో పెద్దగా కనిపించడంలేదు. చెట్టును కొట్టి కాగితం తయారుచేస్తున్నాం. ఆ తర్వాత వాడేసిన కాగితాన్ని మట్టిలో కలిపేస్తున్నాం. దీనివలన చెట్లు వృథాగా మట్టిలో కలిసిపోయినట్లే అవుతోంది. దీనికి విరుగుడు ఏమిటంటే.. వినియోగించిన కాగితాల్ని రీసైకిల్ చేయడమే. ఒక టన్ను కాగితాన్ని రీసైకిల్ చేస్తే (పునర్వినియోగపర్చుకోగలిగితే..) 17 చెట్లను కాపాడినట్లవుతుందని అంచనా. ప్రపంచవ్యాప్తంగా అన్ని వార్తా పత్రికల్ని రీసైకిల్ చేస్తే ఏటా 25 కోట్ల చెట్లను కాపాడగలమని మరో అధ్యయనం తెలిపింది. ఒక చెట్టు ఒకటిన్నర లక్షల పెన్సిళ్ళను ఇస్తుంది. అన్ని దేశాలూ కలిసి ఏటా 1500 కోట్ల పెన్సిళ్లను తయారుచేస్తున్నాయి.

పర్యావరణం భూమికి రక్షణ కవచం
జీవవైవిధ్యం భూమికి ఆభరణం

జె.ఎస్.ఎన్. మూర్తి

(జె.ఎస్.ఎన్. మూర్తి)

చీఫ్ ఎడిటర్- వనసంరక్షిణి

మడ అడవుల్లో నడకతో వన్యప్రాణి సప్తాహం

వన్యప్రాణి వారోత్సవాలు కోరంగి అభయారణ్యం పరిధిలోని చొల్లంగిలో మంగళవారం ప్రారంభమయ్యాయి. ఆంధ్రప్రదేశ్ అటవీశాఖ, ఇగ్రీ (తూర్పు గోదావరి నదీ ముఖద్వారా జీవ వైవిధ్య పరిరక్షణ సంస్థ) సంయుక్తంగా ఈ వారోత్సవాలు నిర్వహిస్తున్నాయి. చొల్లంగి లో జరిగిన ప్రారంభ కార్యక్రమానికి వన్యప్రాణి విభాగం డి ఎఫ్ ఓ ,ఇగ్రీ ఫౌండేషన్ అదనపు సిఇఓ అనంత శంకర్ అధ్యక్షత వహించారు. వన్యప్రాణి వారోత్సవాల నిర్వహణ ద్వారా వన్యప్రాణి రక్షణపై ప్రజల్లో సదవగాహన కల్పించేందుకు కృషి చేస్తామని ఆయన చెప్పారు. అభయారణ్యం మస్కట్ అయిన ఫిషింగ్ కేట్ పోస్టర్ ను ఆయన ఆవిష్కరించారు. ఇగ్రీ పరిధిలో వన్యప్రాణి రక్షణకు, సముద్ర జీవుల రక్షణకు చేస్తున్న కృషిని, సాధించిన ప్రగతిని ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ డాక్టర్ రవి శంకర్ తూపల్లి వివరించారు. ధరిత్రి రక్షిత సమితి అధ్యక్షురాలు సురేఖ మాట్లాడుతూ వన్యప్రాణులను సంరక్షించాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఈ కృషిలో సమాజ భాగస్వామ్యాన్ని పెంపొందించాలని ఆకాంక్షించారు. కైట్ కళాశాల అధ్యాపకుడు వినయ్ ప్రసంగిస్తూ ప్రకృతి వనరుల వినియోగంలో ఎవరికి వారు స్వీయ నియంత్రణ కలిగి ఉండాలన్నారు. ఇగ్రీ ప్రాంతీయ పరిధిలోని వివిధ విద్య సంస్థలనుంచి వచ్చిన పలువురు విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థులు, అధికారులు, స్థానికులు కలసి మడ అడవుల్లో జీవ వైవిధ్య పరిశీలకు నిర్వహించిన నడక (మాన్ గ్రూవ్ వాక్) ఆకట్టుకుంది. స్వచ్ఛభారత్ లో భాగంగా విద్యార్థుల సహాయంతో అభయారణ్యం లో చెత్తను తొలగించి శుభ్రపరిచారు. నీటిపిల్లి, నీటికుక్క తదితర మడ అరణ్య జీవుల్ని గురించి ఫారెస్ట్ అధికారులు వివరించారు. లైవ్ పెయింటింగ్, మొబైల్ ఫోటోగ్రఫీ అంశాల్లో పోటీలు నిర్వహించారు. అక్టోబర్ 2 నుంచి 8 వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా వన్యప్రాణి వారోత్సవాలను నిర్వహించామని వన్యప్రాణి విభాగం (రాజమండ్రి) డిఎఫ్ఓ అనంత శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. వన్యప్రాణి సంరక్షణ లక్ష్యాలతో ముడిపడిన ఈ వారోత్సవాలు భారతదేశంలో 1952 నుంచి ఏటా జరుగుతున్నాయని పేర్కొన్నారు. కోరింగ అభయారణ్యం, మహా పుష్కర నగర వనం (రాజమండ్రి), వనవిహారి (మారేడుమిల్లి) ప్రాంతాల్లో విద్యార్థుల్ని భాగస్వాముల్ని చేస్తూ వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. లైవ్ పెయింటింగ్, మొబైల్ ఫొటోగ్రఫీ, లోగోలు, స్లొగన్స్ డిజైనింగ్ విభాగాల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. రాజమండ్రిలోని నగరవనం, మారేడుమిల్లి వనవిహారి ప్రాంతాల్లో ప్రతి సాయంత్రం 6 గంటలకు వన్యప్రాణి సంరక్షణ ప్రధానాంశంగా కల డాక్యుమెంటరీలు, చలనచిత్రాల ప్రదర్శన నిర్వహించారు. వన్యప్రాణి జీవనానికి సంబంధించి ఆసక్తి, అవగాహనా కల్పించే కార్యక్రమాలు రూపొందించినట్లు అనంత శంకర్ తెలిపారు.

స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అటవీ అకాడమీ ప్రాంగణాన్ని అటవీ అకాడమీలో శిక్షణ పొందుతున్న శాఖ ఉద్యోగులు మంగళవారం శుభ్రపరిచారు. రాష్ట్రం నలుమూలలనుంచీ అకాడమీలో శిక్షణకు గాను వచ్చిన అటవీ ఉద్యోగులు ఈ శ్రమదానంలో పాల్గొన్నారు. అటవీ అకాడమీ డైరెక్టర్ జెఎస్ఎన్ మూర్తి వారిని ఉద్దేశించి మాట్లాడుతూ పరిశుభ్రత పర్యావరణ పరిరక్షణకు మొదటిమెట్టని తెలిపారు. ముఖ్యంగా ప్లాస్టిక్ వ్యర్థాలు భూమిలో కలవకుండా చూడాలన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు మానవాళి మనుగడకే కాక ప్రకృతికి కూడా పెనుముప్పుగా మారుతున్నాయన్నారు. డెప్యూటీ డైరెక్టర్లు ఎంవి ప్రసాదరావు, ఎం శ్రీనివాస్ ఇతర ఫ్యాకల్టీ సభ్యులు ఈ శ్రమదానాన్ని పర్యవేక్షించారు.

అటవీ అకాడమీలో స్వచ్ఛ భారత్

గిర్ జాతీయవనం.. మృగరాజుల నిలయం

గుజరాత్‌లోని "గిర్ జాతీయ అభయారణ్యం" లేదా "గిర్ జాతీయవనం" ఎంతో ప్రత్యేకత కలిగినది. ఇది ఆసియా ప్రాంతపు సింహాలకు నిలయం. ముళ్లపొదలతో నిండిన ఈ అరణ్యంలో అక్కడక్కడా పొదల్లో మృగరాజులు పొంచి ఉంటాయి.

గిర్ జాతీయవనం సుప్రసిద్ధమైన వన్యప్రాణుల సంరక్షణ కేంద్రం. ఇది 1965 సంవత్సరంలో సుమారు 1412 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో స్థాపించబడినది. ఇది జునాగఢ్ పట్టణానికి 65 కిలోమీటర్ల దూరంలో ఉన్నది. జునాగఢ్ పట్టణం గుజరాత్‌లోని ఓ చారిత్రక నగరం. జునాగఢ్ అనేది భారత దేశంలో సంస్థానంగా ఉండేది. జునాగఢ్ అంటే గుజరాతీ భాషలో "పాత కోట" అని అర్థం. ఇది గిర్నార్ పర్వత సానువుల్లో కలదు. గిర్ జాతీయవనం విశిష్టత ఏమిటంటే ఆసియా ఖండంలోనే ఇది ఆసియాటిక్ సింహాలకు స్థావరంగా ఉన్న ఏకైక అభయారణ్య ప్రాంతం. ఏకైన ఆసియా సింహాలు (Asiatic Lions : (Panthera leo persica) నివసించే ప్రాంతం. భారత స్వాతంత్రానికి ముందే జునాగఢ్ సంస్థానానికి చెందిన నవాబు ఈ ప్రాంతాన్ని రక్షిత ప్రాంతంగా గుర్తించాడు. అప్పటి నుండి ప్రభుత్వ మరియు వివిధ స్వచ్ఛంద సంస్థల పర్యా వరణ పరిరక్షణ చర్యల మూలంగా 15 మాత్రమే ఉండే ఈ ఆసియా సింహాలు 2005 సంవత్సరపు గణాంకాల ప్రకారం 359 కి చేరాయి.

వృక్ష జాతులు : గిర్ అభయారణ్యంలో 1955 సంవత్సరంలో సర్వే జరిపి 400 పైగా వృక్ష జాతులున్నట్లు గుర్తించారు. బరోడా విశ్వవిద్యాలయం వారి సర్వేలో ఈ సంఖ్య 507 గా నిర్ధారించారు. ఈ అరణ్యం డ్రై డెసిడుయస్ మరియు టేకు అరణ్యం గా వర్గీకరించారు. నిజానికి ఇది పశ్చిమ భారతదేశంలోని అతి పెద్ద డ్రై డెసిడుయస్ అరణ్యం. ఇక్కడి తూర్పు ప్రాంతంలో సగానికి పైగా భాగంలో టేకు వృక్షాలున్నాయి.

జల వనరులు : గిర్ అభయారణ్యం గుండా ఏడు నదులు ప్రవహిస్తున్నాయి: హిరన్, శత్రుంజీ, దటర్డి, శింగోడా, మఛుంద్రి, ఘొడావరి మరియు రావల్ వీటి పేర్లు. వీనిలో హిరన్, మఛుంద్రి, రావల్ మరియు శింగోడా నదులపై ఆనకట్టలు నిర్మించడంతో నాలుగు జలాశయాలు ఏర్పడి వన్యప్రాణుల జీవనాధారమైనవి.

2015 గణాంకాల ప్రకారం గిర్ అభయారణ్యం 520 సింహాలకు ఆవాసంగా ఉంది. గిర్ అడవుల్లో 2018 సెప్టెంబర్, అక్టోబర్ మాసాల్లో పాతిక పైగా సింహాలు మృత్యువాత పడడం దేశవ్యాప్తంగా ఆందోళన, ఆవేదన కలిగించింది. దీనిపై సుప్రీం కోర్టు స్పందించి 'సింహాలను తప్పకుండా రక్షించాలి. ఎందుకు ఇన్ని మృత్యువాత పడుతున్నాయి. వెంటనే దానికి కారణాలు తెలుసుకొని వాటిని రక్షించే ప్రయత్నము చేయాలంది. గుర్తుతెలియని వైరస్, ఇన్‌ఫెక్షన్ సోకడంతో ఈ సింహాల మరణం చోటుచేసుకుందని అటవీ శాఖ అధికారులు వెల్లడించారు.

గిర్ చుట్టు పక్కల ప్రాంతంలో జరుగుతోన్న అభివృద్ధి కార్యక్రమాలు, అక్రమ మైనింగ్ కారణంగా మానవ, జంతు ఆవాసాల మధ్య దూరం తగ్గిపోతున్న ది. గిర్ పరిరక్షణ కోసం సుప్రీం కోర్టు ఇప్పటికే కొన్నింటిని సీజ్ చేసింది.

మత్స్యకారుల నేస్తం వేల్ షార్క్



వేల్ షార్క్ (బొక్కు సొర చేప) సంరక్షణకు తూర్పుగోదావరి తీరంలో అటవీశాఖ, తూర్పు గోదావరి నదీ ముఖద్వార జీవ వైవిధ్య పరిరక్షణ సంస్థ (ఇగ్రీ ఫౌండేషన్) సంయుక్తంగా చేస్తున్న కృషి, తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. అంతకుముందు ఐదేళ్ళలో 84 వేల్ షార్క్ చేపలు మరణించగా, గత రెండేళ్లలో ఒక్కటి మాత్రమే అటువంటి ఘటన జరిగింది. 2017 సెప్టెంబర్ 9 న కాకినాడ తీరంలో 1.5 టన్నుల బరువున్న వేల్ షార్క్ మత్స్యకారుడి వలలో పడింది.. కానీ అది మరణించడంతో ఫిషింగ్ హార్బర్‌కి తరలించారు. ఈ ఘటన మినహా గత రెండేళ్లలో మరే వేల్ షార్క్ తూర్పు సాగర తీరంలో మరణించినట్లు నమోదు కాలేదు. జీవ వైవిధ్య రక్షణ దిశగా దీనిని మైలురాయిగా చెప్పుకోవచ్చు.

అత్యంత ప్రాధాన్యం కలిగిన జీవి

వేల్ షార్క్ అని ఇంగ్లిష్ లో పిలిచే అతి పెద్ద తిమింగలం జాతి చేప బొక్కుసొర. దీనిని పులి బొక్కు సొర అని కూడా అంటారు. ప్రకృతి సంరక్షణ అంతర్జాతీయ సంఘం IUCN ప్రమాదకర పరిస్థి తుల్లో ఉన్నట్లు గుర్తించిన ఏడు రకాల తిమింగలాల్లో ఇది ఒకటి. భారతదేశంలో అమల్లో ఉన్న చట్టాల ప్రకారం పెద్దపులితో సమానమైన ప్రాధా న్యతను ఇచ్చి బొక్కుసొర చేప సంరక్షణ చర్యలు అమలు చేస్తున్నారు. ప్రభుత్వం వన్యప్రాణి సంరక్షణ చట్టం షెడ్యూల్ ఒకటిలో బొక్కుసొర రక్షణ అంశాన్ని ప్రత్యేకంగా పొందుపరిచింది. బొక్కు సొరను వేటాడినా, చంపినా, విక్రయించినా, రవాణా చేసినా ఏడేళ్లు జైలుశిక్ష, రూ. 50 వేల జరిమానా విధిస్తారు.

ఐదేళ్ళలో 84 వేల్ షార్కుల మృతి...

ఫసిపిక్ మహాసముద్రం, అరేబియా సముద్రం నుంచి బంగాళాఖాతంలోకి ప్రవేశించే బొక్కుసొర చేపలు మత్స్యకారుల వలలకు చిక్కి, బోట్ల పంకాలకు తగిలి పెద్ద సంఖ్యలో చనిపోతున్నాయి. కొన్నేళ్ల కిందట తూర్పు సాగర తీరంలో వేల్ షార్క్ చేపల మరణాలు సహజం అన్నట్లుగా పరిస్థితి ఉండేది. ఏటా 15 కి పైగా వేల్ షార్క్‌ల కళేబరాలు తీరానికి కొట్టుకు రావడమో, లేక మత్స్యకారుల వలల్లో చిక్కి చనిపోవడమో జరుగుతూ ఉండేది. బొక్కు సొరచేప ద్వారా వచ్చే ఆయిల్‌ను విదేశాలకు ఎగుమతి చేసుకోవచ్చనే అపోహతో కొందరు ఈ చేపను చంపేవారని నిపుణులు చెబుతున్నారు. అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం 1889 - 1998 మధ్య 110 సంవత్సరాల్లో మొత్తం ఆంధ్రప్రదేశ్ తీరంలో వలలకు చిక్కి మరణించిన వేల్ షార్క్ ల సంఖ్య 20 మాత్రమే. అయితే జూన్, 2013 నుంచి జూన్ 2018 మధ్య ఇగ్రీ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వేలలో మొత్తం 84 వేల్ షార్క్ చేపలు మరణించినట్లు నిర్ధారణ అయింది. దిగ్భ్రాంతి కలిగించే ఈ వాస్తవం నేపథ్యంలో అటవీశాఖ అప్రమత్తమై బొక్కుసొర చేప సంరక్షణకు ఉద్యమ స్థాయిలో చర్యలు చేపట్టింది. ఈ ప్రయత్నాలు, కృషి ఫలిస్తుండడంతో రెండేళ్లుగా వీటి మరణాలు ఆగాయి. గతంలో అత్యంత అరుదుగా మాత్రమే ఇగ్రీ పరిధిలో దర్శనమిచ్చే ఈ బొక్కుసొర చేప గత రెండేళుగా తరచుగా కనిపిస్తుండడమే అటవీశాఖ, ఇగ్రీ కృషి సఫలమైందనడానికి నిదర్శనం.

ప్రచారం తీరిదీ...

జీవ వైవిధ్యాన్ని పరిరక్షించడానికి బొక్కు సొర జాతి చేపలను సంరక్షించాలని అటవీశాఖ పెద్దఎత్తున ప్రచారం చేపట్టి మత్స్యకారుల్లో సదవగాహన కల్పించింది. బొక్కు సొర పరిరక్షణపై ఇగ్రీ ఫౌండేషన్ సహకారంతో అవగాహన సదస్సులు నిర్వహించారు. వివిధ గ్రామాల్లో హోర్డింగులు, కరపత్రాల రూపంలో ఇగ్రీ బొక్కుసొర సంరక్షణపై ప్రచారాన్ని నిర్వహించింది. బొక్కుసొర చేపల జీవనవిధానం, వీటి ప్రాధాన్యతపై మత్స్యకారులకు అవగాహన లేకపోవడమే గత కొన్నేళ్లలో 84 సొంచేపల మృతికి ప్రధాన కారణమని ఇగ్రీ ఫౌండేషన్ రాష్ట్ర ప్రాజెక్టు కోఆర్డినేటర్ రవిశంకర్ తూపల్లి తెలిపారు. కాకినాడ, ఉప్పాడ, తాళ్లరేవు, భైరవపాలెం, కాట్రేని కోన, సఖినేటిపల్లి వరకు విస్తరించి ఉన్న తీర ప్రాంతాల్లోని మత్స్య కారులకు వీటి రక్షణపై చైతన్యం, అవగాహన కల్పించడానికి కృషి చేస్తున్నా మన్నారు. సముద్ర జలాలను శుద్ధిచేసి, మత్స్య సంపదను కాపాడే నైజం బొక్కు సొర చేప (వేల్ షార్క్)కు ఉందన్నారు. ఏటా ఆగస్టు 30న అంతర్జాతీయ బొక్కు సొర చేప సంరక్షణ దినం నిర్వహించి మత్స్యకారులతో సమావేశాలు జరిపి వారికి అవగాహన కల్పి స్తున్నామని, కళాజాతాల ద్వారా ఈ చేప ప్రాధాన్యతను తెలియ చేస్తూ ప్రచారం నిర్వహిం చామని కాకినాడ డిఎఫ్ఓ నందని సలారియా అన్నారు.

బొక్కుసొర శాకాహారి....

సముద్ర జీవరాశుల్లో అతి పెద్దదైన బొక్కుసొర చేప శాకాహారి. సముద్రంలోని మొక్కలను, నాచుని ఇది తింటుంది. ఈ చేపపై ఆధారపడి అనేక సాగర జీవరాశులు మనుగడ సాగిస్తాయి. మానవునికి కాకుం డా ఇతర జీవులకు కూడా ఈ చేప ఎటువంటి హాని చేయదు. ఈ చేప దాదా పు 100 సంవత్సరాలు జీవిస్తుందని, 12 మీటర్ల పొడవున్న బొక్కుసొర చేప 11 మెట్రిక్ టన్నుల బరువు ఉంటుందని అంచనా. సముద్ర జలాలను శుద్ధి చేయడ మే కాక మత్స్య సంపద పెరగడానికి ఈసొర దోహద పడుతుంది. వలలో ఈ చేప చిక్కినట్లైతే వలను కత్తిరించి ఈ సొరచేపను సురక్షితంగా సముద్రంలోకి వదిలేసి, ఆ వీడియోని అధికారులకు ఇస్తే పరిహారం చెల్లిస్తారు. కాకినాడలో ఇలా చేసినందుకు ఒక ఒక మత్స్యకారునికి రూ. 18 వేల పరిహారం ఇచ్చారు. మత్స్యకారులకు కూడా అవగాహన పెరుగుతోంది. మరపడవలపై చేపలవేట, పారిశ్రామిక వ్యర్థాలతో పెరిగి పోతున్న కాలుష్యం, ప్రాస్టిక్ వ్యర్థాల ప్రభా వం కారణంగా ఇప్పటికీ బొక్కుసొర చేప లకు ముప్పు పొంచే ఉందని ఇగ్రీ ఫౌండేషన్ కన్సర్వేషన్ బయాలజిస్ట్ ఈశ్వర్ నారాయణ అన్నారు.

అడవి.. మానవులపై దాని ప్రభావం

పూర్వకాలంలో తెగలు ఉండేవి. అప్పట్లో ఒక తెగ నాయకుని లేదా రాజు యొక్క సంపదని తెలియ జేయడానికి "అడవి" అన్న పదం వాడేవారు. రాజులు మరియు రాజ్యాల ప్రాభవం తగ్గిపోయాక అడవికి ఉన్న ఈ పాత అర్థం మారిపోయింది. ఇప్పుడు సహజ పరిస్థితులలో వృక్షాలతో ఆవరించ బడ్డ భూమిని అడవి అని పిలుస్తారు. ఇవి ప్రయరీలు, మైదానప్రాంతాలు, గడ్డి భూముల కంటే భిన్నమైనవి. ప్రస్తుత భావనలో అడవి అంటే స్వాభావికంగానైనా మానవులచేతనైనా పెరిగిన లేదా పెంచబడిన ఆర్థిక జీవసంబంధ ప్రాముఖ్య మైన మొక్కలు కలది. ఇక్కడ ఉత్పన్నమయ్యే కలప ఇతర పదార్థాలు ఆర్థిక ప్రాముఖ్యత కలిగినవి. అరణ్యంలోని చెట్ల మధ్య సంబంధం, నేలకోత నుండి రక్షణ మరియు వాతావరణంపై ప్రభావం ఇవన్నీ జీవసంబంధమైనవి.

అడవి-మానవులు

ఆదిమానవుని కాలం నుండి అడవులు మానవునిపై చాలా విధాలుగా ప్రభావాన్ని చూపాయి. ఈ భూమిపై మానవుడు వ్యాప్తి చెందడానికి అడవులు కూడా ఒక ముఖ్య కారణం కావచ్చును. అడవుల్లో లేదా అడవులకి దగ్గరగా జీవించే ఆదిమజాతులవారి ఆధ్యాత్మిక మరియు మత సంబంధ జీవితాన్ని అడవులు ఎంతో ప్రభావితం చేస్తాయి. మానవులు ఆర్థికంగా అభివ ృద్ధి చెందడానికి లేదా మనుగడ సాధించడానికి అడవులలో లభించే ముడిపదార్థాలు కీలకం. అడవులు ఇంధనానికి ఒక ముఖ్య వనరుగా ఉండి మానవుల ప్రగతిపై చాలా ప్రభావాన్ని చూపాయి. మానవుడు ఎన్నో రకాల అడవి ఉత్పత్తులను ఉపయోగించుకొంటున్నాడు. ఈ జాబితాలో మొదటిది కలప, రెండవది ఆహారం. అవసరానికి మించి విస్తారంగా వీటిని ఉపయోగించడం వలన ప్రస్తుతం అడవులు అంతరించిపోయే దశకు వచ్చాయి.

అడవుల సంరక్షణ

వేగంగా అంతరించి పోతున్న అడవుల విస్తీర్ణాన్ని మరియు అడవుల ఉనికిని సంరక్షించడం తక్షణావసరం. జాతీయ స్థాయిలో ఈ దిశగా పలు చర్యలు చేపట్టారు. సమాజంలోని ప్రతి భాధ్యతగల వ్యక్తి వనసంరక్షణకు దోహదం చేసే వివిధ కృత్యాలను స్వచ్ఛందంగా నిర్వహించవచ్చు. ఉదాహరణకు చెట్లకొట్టడాన్ని, వేర్లతో పాటు పెకలించడాన్ని నిరోధించవచ్చు, ముఖ్యంగా వేగంగా పెరిగే మొక్కలను, ఎప్పుడు వీలైతే అప్పుడు ఎక్కడ వీలైతే అక్కడ నాటవచ్చు. పురుగు మందులను సరైన పద్ధతులలో, తగుమేరకు మాత్రమే ఉపయోగించడం, కాలుష్యాన్ని తగ్గించడం, మొక్కలలో వ్యాధుల వ్యాప్తిని నిరోధించడం మొదలైనవి చెయ్యవచ్చు.

భావిభారత పౌరులైన విద్యార్థులకు ప్రాథమికదశలోనే ఈ ఆలోచనలను చొప్పించడానికి క ృషి జరగాలి. conservation patch లేదా సంరక్షణ ప్యాచ్ అనే భావనను ప్రతి వ్యక్తీ సులభంగా ఇంటి దగ్గర గానీ పాఠశాలలోకానీ అమలు చెయ్యవచ్చు. సంరక్షణ ప్యాచ్ అంటే వన్యప్రాణులను గురించి అధ్యయనం చేసే స్థలం.

ఇంటి ఆవరణలో, కార్యాలయాల ప్రాంగణంలో, పాఠశాల స్థలాల్లో వివిద కీటకాలను, సీతాకోకచిలుకలను, తాబేలు మరియు గూడులు కట్టి గుడ్లను పెట్టే జంతువులను ఆహ్వానించే విధంగా మొక్కలను పెంచాలి. చిన్న బోరేజ్ మొక్కలు ఇంటి దగ్గర లేదా పాఠశాల దగ్గర సులభంగా నాటవచ్చు. ఇవి ఈగలను/సీతాకోకచిలుకలను ఆకర్షిస్తాయి. ప్రకాశవంతమైన రంగులు గల స్ట్రాల కట్టను కిటికీ దగ్గర ఉంచితే అవి కందిరీగలు గూడు కట్టుకొనేలా లోపలికి ఆకర్షిస్తాయి. ఖాళీ స్థలాల పరిసరాల్లో పెద్దరాళ్ళ కింద కొద్దికాలం తరువాత వెన్నెముక లేని ప్రాణులను (ఉదాహరణకు తేలు) చూడవచ్చు. పగిలిన పూలకుండీలను చీకటి ప్రదేశంలో వదలి వేస్తే అవి నత్తలకు విశ్రాంతి ప్రదేశం అవుతుంది. స్థలం అందుబాటులో ఉంటే ఒక వెడల్పుమూతి కలిగిన ప్లాస్టిక్ పెద్దగిన్నె ను నీటితో నింపి ఉంచితే అక్కడ పక్షులు స్నానం కోసం వరుసలో నిలబడడం ఆనందాన్నిస్తుంది. ఉడుతల కోసం, కుందేళ్ళ కోసం ఇంటి వంటి నిర్మాణాలను (గూళ్ళు) నిర్మించవచ్చు.

ప్రకృతితో మమేకమే ఆదర్శ జీవనం : డాక్టర్ నళినీమోహన్

జంతు ప్రపంచంపై పరిజ్ఞానం లభిస్తుందన్నారు. అమీబా వంటి సూక్ష్మజీవులు మొదలు ఏనుగు వంటి పెద్ద జంతువు వరకూ అన్నీ జీవవైవిధ్యం పరిధిలోకి వస్తాయన్నారు. కేవలం పుస్తక విజ్ఞానానికి పరిమితం కాకుండా బోటనీ, జువాలజీ విద్యార్థులు అటవీ ప్రాంతాలను, రక్షిత ప్రాంతాలను సందర్శించి సరైన పరిజ్ఞానం పొందాలన్నారు. వన్యప్రాణి సంరక్షణ కోసం, జీవవైవిధ్య పరిరక్షణ కోసం మన రాష్ట్రంలో 13 అభయారణ్యాలు, 3 నేషనల్ పార్కులు, ఒక జీవావరణ పరిరక్షణ కేంద్రం, ఒక టైగర్ రిజర్వ్, ఒక ఎలిఫెంట్ రిజర్వ్ ఇంకా రెండు జూలు, 4 జింకల పార్కులు, రెండు జంతు సంరక్షణ కేంద్రాలు పని చేస్తున్నాయన్నారు. 2029 నాటికి రాష్ట్రంలో 50 శాతం భూమిని హరిత ప్రాంతంగా తీర్చిదిద్దడానికి అటవీ సిబ్బందితో పాటు ప్రతి విద్యార్థి, ప్రతి పౌరుడు చేతులు కలిపి క ృషి చేయాలని నళినీమోహన్ కోరారు. సదస్సుకు అధ్యక్షత వహించిన వైల్డ్ లైఫ్ డి ఎఫ్ ఓ అనంత్ శంకర్ మాట్లాడుతూ వన్యప్రాణి సంరక్షణ పై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించే దిశగా వారోత్సవాల్లో వివిధ కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. రాజమండ్రి సర్కిల్ ముఖ్య అటవీ సంరక్షణాధికారి డాక్టర్ శాంతిప్రియ పాండే ప్రసంగిస్తూ మానవుడి మనుగడకు పర్యావరణ, జీవావరణ సంరక్షణ కీలకమన్నారు. పాపికొండ జాతీయ వనంలో పులుల ఉనికిని గతంలోనే గుర్తించడం జరిగిందన్నారు. బైసన్ (గొాల్ల గేదె) వంటి జంతువులను కూడా ఈ పరిరక్షించడం జరుగుతున్నదన్నారు. అటవీ అకాడమీ డైరెక్టర్ జె ఎస్ ఎన్ మూర్తి మాట్లాడుతూ భావి పౌరులైన విద్యార్థులను ప్రభావితం చేయడం ద్వారా మాత్రమే వన సంరక్షణ, జీవ వైవిధ్య పరిరక్షణ లక్ష్యాలను సాధించడం సాధ్యమని అభిప్రాయపడ్డారు. వన్యప్రాణి సంరక్షణపై రూపొందించిన వివిధ పోస్టర్లను డాక్టర్ నళినీమోహన్ ఆవిష్కరించారు. జిల్లా అటవీశాఖాధికారిణి డాక్టర్ నందని సలారియా, అటవీ అకాడమీ డెప్యూటీ డైరెక్టర్ ఎంవి ప్రసాదరావు, స్క్వాడ్ డి ఎఫ్ ఓ అప్పన్న, స్టేట్ సిల్వికల్చరిస్ట్ ఎ శ్రీహరి గోపాల్, రేంజ్ అధికారులు శ్రీసాయి, శ్రీకాంత్, జె శ్రీనివాస్, కుమార్ తదితరులు పాల్గొన్నారు. పాము కాటు వేస్తే ఏమి చేయాలనే విషయమై డాక్యుమెంటరీ ప్రదర్శన ద్వారా రీసెర్చ్ అసిస్టెంట్ బాలాజీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. అటవీశాఖ నిర్వహించిన క్విజ్ పోటీలో సరైన సమాధానాలు చెప్పిన నన్నయ విద్యార్థినులు మౌనిక, అమూల్య, నాగిని బీ, లిఖిత, స్వర్ణ లకు బహుమతులు ప్రదానం చేసారు.

భారతదేశంలో వన్యప్రాణి సంరక్షణ - చరిత్ర

భారతదేశంలో వన్యప్రాణి సంరక్షణా చరిత్ర ప్రాచీనమైనది. ఆనాటి భారతదేశంలో మునుల ఆశ్రమాల సమీపంలో వన్యప్రాణులను వేటాడటంపై నిషేధం ఉండేది. ఇది ఒకరకంగా పరోక్ష సంరక్షణ. భారతదేశ ఇతిహాసాలు పురాణాలలో వివిధ జంతువులకు దైవత్వాన్ని ఇవ్వటం జరిగింది. ఉదాహరణకు అనేక వన్యజీవులు వివిధ దేవతలకు వాహనాలుగా ఉన్నాయి. దుర్గాదేవికి సింహం, పార్వతీదేవికి పులి, వినాయకునికి మూషికము, కుమార స్వామికి నెమలి వంటివి. అంతేకాక కోతి ఆంజనేయ స్వరూపమని, పాము సుబ్రహ్మణ్యేశ్వరుని రూపమని, గోవు పవిత్రజంతువనీ పూజలందుకోవటం వంటి చర్యలు పరోక్షంగా ఆయా జీవుల సంరక్షణకు దోహదపడేవి. కీ.పూ మూడవశతాబ్దంలో చంద్రగుప్త మౌర్యుని పరిపాలనలో అడవులను సంరక్షించటానికి "కూప్యాధ్యక్షుడు" అనే పేరుతో అధికారి ఉండేవాడని చరిత్ర చెపుతున్నది. ఈ అధికారి అడవులను సంరక్షించుట, వేటను నియంత్రించుట వంటి పనులు చేయటం ద్వారా వన్యప్రాణి సంరక్షణ జరిగేది. కౌటిల్యుని అర్ధశాస్త్రం లో అడవులను, వన్యప్రాణులను సంరక్షించటానికి అనేక చట్టాలు, అతిక్రమించిన వారికి విధించాల్సిన శిక్షలు కనిపిస్తాయి. అక్బర్ పరిపాలనలో వ్యన్యప్రాణులను విచ్చలవిడిగా వేటాడటం అనేది మొదలైంది. ఈయన కాలంలోనే వన్యప్రాణుల సంఖ్య తగ్గిపోతే, అనేకమంది వ్యక్తులు వలయాకారంలో ఏర్పడి డప్పులు వాయిస్తూ వన్యప్రాణులను ఒకచోటికి చేర్చి కేంద్రీకృతంగా వేటాడటం అనే పద్ధతి మొదలైంది. దీనికారణంగా కూడా వన్యప్రాణుల సంఖ్య తగ్గిపోయింది. అప్పటికి భారతదేశం అంతటా విస్తరించి ఉన్న సింహాలు, ఖడ్గమృగాలు అక్బర్ కాలంలో కొన్నిప్రాంతాలకే పరిమితమైనాయి. చీతాలు పూర్తిగా భారతదేశం నుంచి అంతరించి పోయాయి. జహంగిర్ కాలంలోవన్యప్రాణి సంరక్షణకు ప్రత్యేక చట్టాలు చేయబడ్డాయి. వేట నిషేదించారు. ప్రత్యేక అనుమతితో మాత్రమే వేట జరిగేది. బ్రిటిష్ పాలనప్రారంభంలో వన్యప్రాణుల వేట అవిచ్ఛిన్నంగా జరిగింది. అధికారులు, అతిథులకొరకు షికారీలు ఏర్పాటు చేసేవారు. వన్యప్రాణులను వేటాడటం ధైర్యసాహసాలకు, గొప్పతననానికి, ఉన్నతవర్గాలకు గౌరవచిహ్నంగా ఉండేది. వివిధ మహారాజులు, జమిందార్లు, నవాబులు కూడా అదేవిధంగా విచ్చలవిడి వేటను కొనసాగించారు. ఆకారణంగా పులులు, సింహాలు, ఖడ్గమృగాల సంఖ్య మరింత కుచించుకుపోయింది. పంతొమ్మిదవశతాబ్దపు చివర్లో బ్రిటిష్ ప్రభుత్వం కళ్ళు తెరచి వివిధ చట్టాలు చేసింది. 1879 లో ఏనుగుల సంరక్షణ చట్టం, 1912 నాటి వన్య జీవులు పక్షుల చట్టం, 1927 నాటి భారతదేశ అటవీచట్టం వంటివి భారత వన్యజీవుల వైవిధ్యతను కాపాడటానికి దోహదపడ్డాయి.

ప్రముఖ వేటగాడు అయిన Jim Corbett కృషితో, 1936 లో భారతదేశపు మొట్టమొదటి జాతీయపార్కు అయిన "హైలీ జాతీయ పార్కును" Hailey National Park (దీనినే తరువాత జిమ్ కోర్బెట్ జాతీయపార్కుగా పేరు మార్చారు) ఏర్పాటు చేయటం జరిగింది. స్వాతంత్ర్యానంతరం వన్యప్రాణి సంరక్షణ అవసరం గుర్తించారు. వన్యప్రాణుల సంరక్షణ కొరకు చట్టాలు, మార్గదర్శకసూత్రాలు తయారు చేయటానికి, భారతప్రభుత్వం 1952 లో Indian Wildlife Board ను స్థాపించింది. ఈ బోర్డు ఆధ్వర్యంలో అనేక జాతీయపార్కులు, అభయారణ్యాలు, గేమ్ పార్కులు 1970 లలో వచ్చిన రెండు ప్రధానమైన చట్టాలు, భారతదేశవన్యప్రాణి సంరక్షణ రంగాన్ని సమూలంగా మార్చివేసాయి. ఒకటి 1972 నాటి Wild Life Protection Act, రెండు 1973 నాటి అప్పటికి అతిపెద్ద సంరక్షణాపథకాలైన Project Tigerలు. 1980లో వచ్చిన చిప్కో ఉద్యమం కూడా వన్యజీవుల సంరక్షణలో ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందింది. చెట్లు నరకటాన్ని వ్యతిరేకిస్తూ, ఆ చెట్లను కౌగిలించుకొని అహింసాయుత మార్గం ద్వారా ప్రతిఘటించటం ప్రజలలో ఎంతో చైతన్యాన్ని, పర్యావరణం పట్ల అవగాహనను కల్పించింది. 1990 నుండి వన్యప్రాణుల సంరక్షణలో బయోటెక్నాలజీ, కెమెరాట్రాప్, వన్యప్రాణి ఫోరెన్సిక్స్, టెలిమెట్రీ, రిమోట్ సెన్సింగ్ టెక్నాలజీ, సాటిలైట్ మేపింగ్ వంటి అధునాతన పద్ధతులు వచ్చి ఈ రంగాన్ని సమూలంగా మార్చివేసాయి.

అంతర్జాతీయ లక్ష్యాలకు దీటుగా అటవీ అకాడమీలో శిక్షణ

(మొదటి పేజీ తరువాయి)ఎఫ్ఎస్ఓ లకు ఏడాది పాటు శిక్షణ ఉంటుం దన్నారు. మొత్తం 17 సబ్జెక్టులను అత్యున్నత ప్రమాణాలతో బోధించడం జరుగుతుందన్నారు. ఐఎఫ్ఎస్ శిక్షణకంటే ఎక్కువ సిలబస్ ను, సబ్జెక్టులను అకాడమీ పరిధిలో క్షేత్రస్థాయి సిబ్బందికి అందుబాటులో ఉంచడం జరిగిందని ఆయన తెలిపారు. దీనికి అదనంగా డ్రైవింగ్ ను కూడా నేర్పడం జరుగు తోందన్నారు. ఫారెస్ట్రీ అనేది అంతర్జాతీయంగా ఒక కీలక రంగంగా మారిం దని, నానాటికీ ప్రాముఖ్యత పెరుగుతున్నదని చెప్పారు. ఈ నేపథ్యంలో క్షేత్రస్తాయి సిబ్బందిని ఆ ప్రమాణాలకు దీటుగా తయారు చేయడం అకాడమీ ప్రధాన కర్తవ్యమని పేర్కొన్నారు. ముఖ్యంగా కర్బన ఉద్గారాల తగ్గింపు, అటవీ ప్రాంతాల సాంద్రతను కాపాడడం అటవీ అధికారులకు ఛాలెంజ్ అన్నారు. 2029 నాటికి 50 శాతం గ్రీన్ కవర్ అనే లక్ష్యాన్ని ప్రభుత్వం అటవీశాఖ ముందు ఉంచిందన్నారు. దీన్ని చేరుకోవాలంటే అటవీ సిబ్బంది ఉద్యమ స్థాయిలో కృషి చేయాలని మూర్తి సూచించారు. మొక్కలపై ప్రేమను పెంచు కోవడం, వాటి నిజమైన ఉపయోగాలు తెలుసుకోవడం ద్వారా మాత్రమే మొక్క జాతుల్ని సంరక్షించడం సాధ్యమని ఫ్యాకల్టీ సభ్యుడు వైవివి రమణ అన్నారు. శిక్షణ ప్రారంభ కార్యక్రమాన్ని అకాడమీ డైరెక్టర్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. కోర్సు డైరెక్టర్లు ఎం వి ప్రసాదరావు, ఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ అకాడమీలో అభ్యాసకులు పాటించవలసిన నియమ నిబం ధనలను వివరించారు. శిక్షణలో అభ్యాసకులను నైతికంగా కూడా ఉన్నతంగా తీర్చిదిద్దుతామన్నారు. అకాడమీ అధ్యాపకులు ఉదయశంకర్, ఎస్ వి రమణ, రమణకుమార్, రాజేంద్రప్రసాద్, నాగేశ్వరరావు, శ్యాంబాబు , ఆదమ్ రాజు, అకాడమీ ఉద్యోగులు కెవిఎస్ రాజకుమార్ తదితరులు ప్రసంగించారు.

తుఫాన్లకు పేర్లెవరు పెడతారు?

తుఫాన్లకు పేరు పెట్టడం వల్ల అవి నిర్దిష్టమైన గుర్తింపును కలిగి ఉంటాయంటున్నారు పర్యావరణ వేత్తలు. ప్రతీ తుఫాను దేనికదే ప్రత్యేకమైనదని చెప్తున్నారు. తుఫాన్లకు పేర్లను పెట్టే ప్రక్రియను 19వ శతాబ్దం చివర ఆస్ట్రేలియా వాతావరణ శాస్త్రజ్ఞురాలు క్లెమెంట్ లిండ్లీ రాగ్ ప్రారంభించారు. అయితే అది ఎక్కువ రోజులు కొనసాగలేదు. క్రమంగా వాతావరణ శాస్త్రం అభివృద్ధి చెందడంతో తుఫానుల అధ్యయనం పెరిగింది. వాటి రాకను ముందేపసిగట్టే సాంకేతికత ఏర్పడిన తర్వాత తిరిగి పేర్లను పెట్టడం ప్రారంభించారు. రీజియన్ల వారీగా సముద్ర తుఫానులకు ఆయా దేశాల పేర్లతో కలిపి పేర్లను పెడుతున్నారు. అట్లాంటిక్, గల్ఫ్ ఆఫ్ మెక్సికోల్లో ఏర్పడే తుఫానులకు ఆంగ్ల అక్షర వరుసక్రమంలో పేర్లను పెడుతుంది అమెరికాలోని జాతీయ హరికేన్ సెంటర్. ఈ వరుస డబ్ల్యూతో ముగుస్తుంది. ఇలా 2022లో వస్తుందని భావిస్తున్న వాల్టర్ హరికేన్‌కు డబ్ల్యూ అక్షరంతో పేరును పెట్టేశారు. ఒకవేళ ఈలోపు తుఫాన్ల సంఖ్య పెరిగి ఆ జాబితా ముగిసిపోతే, అప్పుడు గ్రీకు అక్షరాలైన ఆల్ఫాతో మరో వరుస పేర్లను పెట్టుకుంటూ వెళ్తారు.

ఈ పేర్లన్నింటినీ ఖరారు చేసేది మాత్రం ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యుఎంవో). ఉత్తర పసిఫిక్ సముద్రంలో వచ్చే తుఫానులకు ఆ తీర ప్రాంతంలోని 14 దేశాలు సూచించిన పేర్లను పెడుతుంటారు. ఒక్కో దేశం పది పేర్లను ప్రతిపాదించాలి. జంతువులు, చెట్లు, గ్రహ సంకేతాలు, పౌరాణిక పాత్రలు.. ఇలా ఏ పేరైనా సూచించవచ్చు. వాటిని ప్రపంచ వాతావరణ సంస్థ ఖరారు చేస్తుంది. పేర్లతో పాటు గందరగోళానికి అవకాశం లేకుండా, తుఫానులకు నెంబర్లనూ కేటాయిస్తారు. ఒక్కోసారి రెండు భాషల సంయుక్త పదాన్ని కూడా పేరుగా పెట్టవచ్చు. హిందూ మహాసముద్రంలో తుఫానులకు వరుసగా బంగ్లాదేశ్, భారత్, మాల్దీవులు, మయన్మార్, ఒమన్, పాకిస్థాన్, శ్రీలంక, థాయిలాండ్ సూచించిన పేర్లను వరుసలో పెడుతారు. 2000 నుంచి డబ్ల్యుఎంవో ప్రకటించిన ఈ విధానాన్ని దేశాలన్నీ అమలు చేస్తున్నాయి.

అటవీ అమరవీరులకు ఘన నివాళి

అటవీ అమరవీరుల సంస్మరణ దినం ప్రతి సంవత్సరం నవంబరు 10 న జరుపుకుంటారు. గంధపు చెక్కల స్మగ్లర్ వీరప్పన్ చేతిలో ప్రాణాలు కోల్పోయిన ఐఎఫ్ఎస్ అధికారి కీర్తిచక్ర పందిళ్ళపల్లి శ్రీనివాస్ సంస్మరణార్థం ఏటా ఈ అమరవీరుల సంస్మరణ దినాన్ని నిర్వహిస్తున్నారు. తమ ప్రాణాలను కూడా లెక్కచేయకుండా కలప స్మగర్లతో, తీవ్రవాదులతో పోరాటం చేసి, విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అటవీశాఖ అమరవీరుల అత్మకు శాంతి కలగాలని శ్రద్ధాంజలి ఘటిస్తూ వారి సేవలను ఈ రోజు గుర్తు చేసుకుంటారు. ఈ సందర్భంగా వివిధ సేవా, ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తారు. రాష్ట్ర రాజధానిలో, అటవీశాఖ ప్రధాన కార్యాలయంలో జరిపినట్లే ప్రతి జిల్లా కేంద్రంలో, ఇతర కార్యాలయాల్లో కూడా అటవీ అమరవీరుల దినోత్సవాలను నిర్వహిస్తారు. విధి నిర్వహణలో ఉన్నప్పుడు అటవీ అధికారులు అనేకకారణాలతో అమరులవుతున్నారు. కలప స్మగ్లింగ్ చేస్తున్నప్పుడు పట్టుకోవడంతో స్మగ్మర్లు చేసే దాడులవల్ల, అటవీ భూములు కాపాడుతునప్పుడు ఆక్రమణ దారులచేసే దాడులవల్ల అడవులలో తనిఖీ చేస్తున్నప్పుడు వన్యప్రాణులు అకస్మాత్తుగా దాడుల చేయడం వల్ల, నక్సలైట్ల దాడుల వల్ల ఇది సంభవిస్తోంది. అటవీ అధికారులు విధినిర్వహణలో దాడులు తగ్గుటకై ప్రభుత్వం చర్యలు మూడు దశాబ్దాల నుంచి సరాసరిన ఏటా ఒక్కో అధికారి మరణం పొందడంతో పాటు అనేక మంది గాయాలబారిన పడుతున్నారు. దీనిపై ప్రభుత్వం తగు చర్యలు కూడా తీసుకుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2010లో హైదరాబాదులోని జూపార్కులో జరిగిన అటవీ అధికారుల సంస్మరణ దినోత్సవంలో అప్పటి రాష్ట్ర అటవీ మంత్రి మాట్లాడుతూ అడవులలో పర్యవేక్షించే అధికారులకు రైఫిళ్ళు సరఫరా చేస్తామని ప్రకటించారు. దట్టమైన అరణ్యాలలో సీసీ కెమెరాలను ఉంచడం కూడా జరిగింది. దీనివల్ల అధికారులు కార్యాలయంలో ఉంటూ అడవులలో జరుగుతున్నది పర్యవేక్షించవచ్చు. స్మగ్లర్లు ఉన్నట్లు తెలిస్తే ఆయుధాలు, బలగాలతో వెళ్ళవచ్చు. దీనివల్ల ప్రాణాపాయ పరిస్థితులు తగ్గుతాయి.

పొడ పామును కాపాడిన అటవీశాఖ సిబ్బంది

రాజమండ్రిలోని హౌసింగ్ బోర్డు కాలనీలో వలలో చిక్కుకుపోయిన పొడ పామును అటవీశాఖ సిబ్బంది రక్షించారు.

ఒక ఇంటి వద్ద పెంపుడు జంతువులకు రక్షణగా ఏర్పాటు చేసిన వలలో ఈ రక్త పొడ పాము చిక్కుకుంది. మంగళవారం ఉదయం ఈ సంగతి గుర్తించిన స్థానికులు అటవీశాఖకు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి వెళ్లిన వైల్డ్ లైఫ్ విభాగం రీసెర్చ్ అసిస్టెంట్ కె.బాలాజీ స్థానికుల సహకారంతో సురక్షితం గా పామును బయటకు తీశారు. వలలో ఇరుక్కుపోయిన పామును తప్పించడానికి చాకచక్యంగా వలను కత్తిరించారు. ఆపైన పామును దివాన్ చెరువు ఏరియాలోని రిజర్వ్ ఫారెస్ట్‌లో సురక్షితంగా వదిలిపెట్టారు. రేంజ్ అధికారి శ్రీ సాయి తదితరులు అభినందించారు.

అటవీ అకాడమీని పరిశీలించిన పిసిసిఎఫ్ (ఎఫ్ఆర్) రమణమూర్తి

(మొదటి పేజీ తరువాయి) నాటిన వాటిలో వేటి మనుగడ శాతం ఎలా ఉంది, మనుగడ రేటు క్షీణతకు లేదా విజయవంతం కావడానికి కారణాలను విశ్లేషించుకోవాలన్నారు. అంతరించిపోతున్న మొక్క జాతులను ఎంపిక చేసి ఒక గ్లాస్ హౌస్‌లో ప్రత్యేకంగా పరిరక్షించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా అగర్‌బత్తి కంపెనీలకు వెదురు స్టిక్‌లను సరఫరా చేసే స్థాయికి కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు.

నగరవనం ఏరియాకు వచ్చే వాకర్స్‌కు బాంబూ సూప్, మారేడు సూప్, ఆహారంగా వినియోగించే గింజలు వంటి ప్రకృతిసిద్ధ పోషక ఉత్పత్తులను విక్రయించే అవకాశాలను అందిపుచ్చుకోవాలని రమణమూర్తి పేర్కొన్నారు. అటవీ అకాడమీ ట్రెయినీలు స్వయంగా ఏర్పాటుచేసి నిర్వహిస్తున్న నర్సరీని పరిశీలించి ప్రశంసించారు. విత్తన సేకరణ నుంచి పెంపకం వరకూ అన్ని బాధ్యతలూ ట్రెయినీలే చేపట్టడాన్ని మెచ్చుకున్నారు. అకాడమీలోని ట్రెయినీస్ డార్మిటరీ, మెస్, డైనింగ్ హాలు కూడా పరిశీలించారు. అకాడమీ డైరెక్టర్ జెఎస్ఎన్ మూర్తి, రాజమండ్రి సర్కిల్ సిసిఎఫ్ డా॥శాంతిప్రియ పాండే, కాకినాడ డిఎఫ్ఓ డా॥నందని సలారియా, ఆర్ఎఫ్ఆర్‌సి సిల్వికల్చరిస్ట్ శ్రీహరిగోపాల్, అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ ఎంవి ప్రసాదరావు పాల్గొన్నారు.